క్లుప్తంగా

నేడు గడప గడపకు మన ప్రభుత్వం

పుల్లలచెరువు: మండలంలోని సుద్దకురవ తండాలో సోమవారం గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహిస్తామని ఎంపీడీవో మరియదాసు తెలిపారు. రాష్ట్ర పురపాలక శాఖమంత్రి ఆదిమూలపు సురేష్ పాల్గొంటారని, ప్రజలకు ప్రభుత్వం చేకూర్చిన లబ్ధిని వివరిస్తారని తెలిపారు.

పెద్దదోర్నాల ఎస్సైగా అంకమరావు



అంకమరావు

పెద్దదోర్నాల: మండల కేంద్రం పెద్దదోర్నాల ఎస్సైగా పి.అంకమరావు ఆదివారం బాధ్యతలు చేపట్టారు. గతంలో ఎస్సైగా విధులు నిర్వహించిన శ్రీనివాసరావు ఒంగోలు డీసీఆర్‌బీకి బదిలీ కాగా అంకమరావు ఇక్కడకు వచ్చారు. స్టేషన్ సిబ్బంది, మండల నాయకులు మర్యాద పూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలిపారు.

గుండె చికిత్సలో విప్లవాత్మక మార్పులు



కార్యక్రమంలో మాట్లాడుతున్న డాక్టర్ రమేష్‌బాబు

కొత్తపట్నం: గుండె జబ్బులకు అందించే వైద్యంలో శాస్త్రీయపరంగా, సాంకేతికంగా ప్రపంచ వ్యాప్తంగా విప్లవాత్మక మార్పులు వచ్చాయని ఒంగోలులోని ఆస్టర్ రమేష్ హాస్పిటల్ చీఫ్ కార్డియాలజిష్టు పోతినేని రమేష్‌బాబు అన్నారు. హాస్పిటల్ ఆధ్వర్యంలో స్థానిక నల్లూరు గార్డెన్ రిసార్ట్స్‌లో ఆదివారం వైద్య విద్య కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ రమేష్ మాట్లాడుతూ ఇటీవల ఆకస్మికంగా గుండెపోటు వచ్చి మరణించే వారి సంఖ్య పెరిగిపోయిందని తెలిపారు. అలాంటి మరణాలు 80 శాతం నివారింపదగినవేనని అన్నారు. కొత్తగా వచ్చిన పరీక్షల ద్వారా కొలెస్ట్రాల్ గడ్డలను ముందే గుర్తించి చికిత్స చేయించుకుని ఆకస్మిక గుండెపోటు మరణాలను నివారించవచ్చని తెలిపారు. దాగి ఉండే గుండె జబ్బును ఫ్యామిలీ ఫిజీషియన్ కూడా ముందే గుర్తించగలరని తెలిపారు. రిమ్స్ మెడికల్ సూపరింటెండెంట్ డాక్టర్ భగవాన్‌నాయక్ మాట్లాడుతూ వైద్యులు నిరంతరం వైద్య రంగంలో వస్తున్న నూతన ఆవిష్కరణలను అందిపుచ్చుకుంటే రోగులకు శాస్త్రీయ పద్ధతుల్లో వైద్యం అందుతుందని వివరించారు. కార్యక్రమంలో ప్రత్యక్షంగా 380 మంది డాక్టర్లు, ఆన్‌లైన్ ద్వారా 175 మంది డాక్టర్లు పాల్గొన్నారు. ఐఎంఏ ప్రెసిడెంట్ డాక్టర్ రంగనాథ్‌బాబు, సెక్రటరీ డాక్టర్ మణిబాబు, మెడికల్ కౌన్సిల్ అబ్జర్వర్ డాక్టర్ మురళీకృష్ణ, డాక్టర్లు వెలగా అనూప్, జయరామ్ పాయ్, బికాస్ సాహు, బత్తిని రాజేష్, జ్యోతి ప్రకాష్, భరత్ సిద్ధార్థ, నిశ్చల్‌రెడ్డి, హరణి, పెరుమాళ్ల, కార్తీక్‌బాబు, ధరణి, పవన్, ధీరజ్, రవీంద్రరెడ్డి, వంశీకృష్ణ, అజయ్‌పవన్, శిల్ప, శరణ్, జహంగీర్, సుల్తాన్, ప్రతిమ, శ్యామ్‌సుందరి తదితరులు పాల్గొన్నారు.

'మీ మేలు మరువలేం'



కృష్ణమోహన్‌రెడ్డిని సన్మానిస్తున్న దళితులు

మార్కాపురం: తమ కుటుంబానికి వ్యక్తిగతంగా ఎమ్మెల్యే కేపీ నాగార్జునరెడ్డి సోదరుడు కృష్ణమోహన్‌రెడ్డి చేసిన సహాయాన్ని జీవితాంతం గుర్తుపెట్టుకుంటామని కొనకనమిట్ల మండలం చిన్నారికట్ల గ్రామ దళితులు సిరిగిరి యోనా, మరియమ్మ, ఆదాం, చినబాబు, కుమారి తదితరులు పేర్కొన్నారు. ఆదివారం వారు మార్కాపురం వచ్చి కృష్ణమోహన్‌రెడ్డిని ఘనంగా సన్మానించారు. తీవ్రమైన కుటుంబ సమస్యను ఆయన దృష్టికి తీసుకెళ్లగా అధికారులతో మాట్లాడి తమకు న్యాయం చేశారని తెలిపారు. గ్రామానికి చెందిన రవికుమార్, నర్సయ్య, నాగేంద్ర, నరసింహులు ఉన్నారు.



తాళ్లూరు: అలంకరించిన గుంటి గంగా భవాని అమ్మవారు



బొద్దికూరపాడులో పోలేరమ్మ దర్శనం కోసం వేచి ఉన్న భక్తులు

ఘనంగా నాగార్పమ్మ కొలుపులు

తాళ్లూరు: విఠలాపురంలో ఆరు దశాబ్దాల అనంతరం రజక సంఘం ఆధ్వర్యంలో నాగార్పమ్మ కొలుపులు ఆదివారం ఘనంగా నిర్వహించారు. జీర్ణావస్థకు చేరిన నాగార్పమ్మ దేవాలయంలో రజక సంఘం ఆధ్వర్యంలో కమిటీ ఏర్పడి జీర్ణోద్ధరణ చేశారు. అనంతరం రూ. 16 లక్షల వ్యయంతో గుడి నిర్మాణం, అన్నదానం నిర్వహించారు. శుక్రవారం నుంచి ఆదివారం వరకు పలు పూజలు నిర్వహించారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని అమ్మవారికి మొక్కులు చెల్లించుకున్నారు. బంధు మిత్రులు రాకతో గ్రామం కళకళ లాడింది.

పోలేరమ్మ తల్లి కొలుపులు

బొద్దికూరపాడులో పోలేరమ్మ తల్లి కొలుపుల వార్షికోత్సవం ఆదివారం ఘనంగా నిర్వహించారు. మహిళలు, భక్తులు అధిక సంఖ్యలో ఊరేగింపుగా వెళ్లి అమ్మవారికి నైవేద్యం పెట్టి మొక్కులు చెల్లించారు. అధిక సంఖ్యలో భక్తులు, బంధు మిత్రులు రాకతో గ్రామం నూతన కళ సంతరించుకుంది.

గుంటి గంగా భవానికి పూజలు

జిల్లాలో ప్రసిద్ధి చెందిన గుంటి గంగా భవాని అమ్మవారికి ఆదివారం విశేష పూజలు నిర్వహించారు. అధిక సంఖ్యలో భక్తులు పాల్గొని పొంగళ్లు పెట్టి మొక్కులు తీర్చుకున్నారు. భక్తులు పన్నెండు చీరలు బహూకరించారు. ఆలయానికి రూ. 17,698 ఆదాయం వచ్చినట్లు ఆర్పీ శ్రీనివాసరావు తెలిపారు. దర్శి సీఐ రామకోటయ్య అమ్మవారిని సందర్శించి ప్రత్యేక పూజలు చేశారు. ఈఓ భాస్కర్ రెడ్డి, ఆలయ అధికారి శ్రీనివాసరావు పర్యవేక్షించారు.



విఠలాపురంలో నాగార్పమ్మ గుడి వద్ద భక్తులు

సూపర్‌స్టార్ కృష్ణ విగ్రహావిష్కరణ



కృష్ణ విగ్రహాన్ని ఆవిష్కరించిన ఉప్పలపాటి సూర్యనారాయణబాబు, కామూరి రమణారెడ్డి

కొమరోలు : తెలుగు రాష్ట్రాల్లోని అభిమానుల గుండెల్లో తన నటనతో సూపర్‌స్టార్ కృష్ణ చెరగని ముద్ర వేశారని ఆయన బావమరిది, సినీనిర్మాత ఉప్పలపాటి సూర్యనారాయణబాబు తెలిపారు. వెన్నంపల్లెలో సినీ నటుడు కృష్ణ ల్లూరి సీతారామరాజు వేషధారణతో ఉన్న విగ్రహాన్ని ఆయన అభిమానుల సంఘం అధ్యక్షుడు శ్రీనివాసరెడ్డి, కాశిరెడ్డి ఏర్పాటు చేసిన విగ్రహావిష్కరణకు సూర్యనారాయణబాబుతో పాటు వైఎస్సార్ సీపీ నాయకులు కామూరి రమణారెడ్డి హాజరయ్యారు. అనంతరం అన్నదానం ఏర్పాటు చేశారు. ముక్తాపురం సర్పంచ్ ఆర్.వి.రమణరెడ్డి, వాసుదేవరెడ్డి, మహీధర్ తదితరులు పాల్గొన్నారు.

పోలేరమ్మ తల్లికి ప్రత్యేక పూజలు



ప్రత్యేక అలంకరణలో పోలేరమ్మ తల్లి

మార్కాపురం టౌన్: పట్టణ శివారులో కొలువై ఉన్న అల్లూరి పోలేరమ్మ ఆలయంలో ఆదివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. అమ్మవారి మూలవిరాట్‌ను ఆలయ అర్చకుడు వెంకటేశ్వర్లు ప్రత్యేకంగా అలంకరించి కుంకుమార్చన, అభిషేకాలు, పూజలు చేశారు. ఆలయ ఆవరణలోని పుట్ట, నాగశిలలకు భక్తులు పూజలు చేశారు. పొంగళ్లు పెట్టి అమ్మవారికి నైవేద్యంగా సమర్పించారు. భక్తులకు ఇబ్బంది లేకుండా ఏర్పాట్లను ఆలయ ఈఓ చెన్నకేశవరెడ్డి, ధర్మకర్తలు, ఆలయ సిబ్బంది శ్రీధర్‌రెడ్డి తదితరులు పర్యవేక్షించారు.

దివ్యాంగులకు మంచాలు అందజేత

మార్కాపురం: స్థానిక పట్టణ పోలీస్ స్టేషన్ హోంగార్డు చెన్నుపల్లి కాశయ్య ఆధ్వర్యంలో ఆదివారం స్ఫూర్తి వెల్ఫేర్ పాఠశాలలోని దివ్యాంగులకు 5 మంచాలను దాతల సహకారంతో అందించారు. పట్టణ పోలీసు విభాగంలో కమ్యూనికేషన్ ఎస్సైగా పనిచేస్తున్న ఎస్.రామకృష్ణారెడ్డి ఆర్థిక సాయంతో మంచాలు అందించినట్లు హోంగార్డు తెలిపారు. దాతలు స్పందించి నిరుపేదలకు సహాయ సహకారాలు అందించాలని కోరారు.



దివ్యాంగులకు మంచాలు అందిస్తున్న దాత

గొట్లగట్టులో ఉచిత వైద్య శిబిరం



మందులు పంపిణీ చేస్తున్న మాజీ ఎంపీపీ

కొనకనమిట్ల: మండలంలోని గొట్లగట్టు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఆవరణలో ఆదివారం పొదిలికి చెందిన ఉడుముల హాస్పిటల్ ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. హాస్పిటల్ నిర్వాహకులు డాక్టర్ ఉడుముల అశోక్‌రెడ్డి, డాక్టర్ ఎస్‌వీ గీతికారెడ్డి పర్యవేక్షణలో ఆర్థోపెడిక్, జనరల్ మెడిషన్, స్త్రీల వైద్య నిపుణులు పాల్గొని పరీక్షలు చేసి మందులు అందజేశారు. వైద్యశిబిరాన్ని మాజీ ఎంపీపీ, గొట్లగట్టు ఎంపీటీసీ ఉడుముల రామనారాయణరెడ్డి ప్రారంభించారు.

సాయి మందిరంలో గురుపౌర్ణమి వేడుకలు

తర్లుపాడు: స్థానిక షిర్డీ సాయి మందిరంలో గురుపౌర్ణమి ఉత్సవాలు ఘనంగా ప్రారంభమయ్యాయి. ఆదివారం ఆలయ చైర్మన్ రిటైర్డు తహసీల్దార్ నాగమల్లికార్జున్ ఆధ్వర్యంలో ప్రత్యేక అలంకరణ చేసి అభిషేకాలు, పూజలు చేశారు. అనంతరం సాయి భక్తులు భిక్షాటనలో పాల్గొన్నారు. 9 రోజుల పాటు ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు చెప్పారు. నెహ్రూ యూత్ అధ్యక్షుడు పుల్లయ్య తదితరులు పాల్గొన్నారు.



భిక్షాటనలో పాల్గొన్న సాయి భక్తులు

నేత్ర వైద్య శిబిరం విజయవంతం

కంభం: పేదలకు నేత్ర వైద్యశిబిరాలు ఎంతగానో ఉపయోగపడతాయని స్పందించే హృదయాలు చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ పులి శ్రీనివాస ప్రసాద్ అన్నారు. ఆదివారం యల్‌కోట మండల పరిషత్ పాఠశాలలో ఉచిత కంటి వైద్య శిబిరం ఏర్పాటు చేశారు. నంద్యాల శాంతిరామ్ సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్ వైద్యులు డాక్టర్ వంశీక్రిష్ణ, ప్రవీణ్ కుమార్ నేతృత్వంలో నేత్రపరీక్షలు నిర్వహించి అవసరమైన వారికి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. 30 మందిని నంద్యాల శాంతిరామ్ వైద్యశాలకు తీసుకెళ్లినట్లు ట్రస్ట్ చైర్మన్ పులిశ్రీనివాస ప్రసాద్ తెలిపారు. ట్రస్ట్ సభ్యులు బీవీ రామక్రిష్ణ, బాలరంగారావు పాల్గొన్నారు.



రోగులకు నేత్ర పరీక్షలు నిర్వహిస్తున్న వైద్యులు

సీట్ల భర్తీకి ఈ నెల 30న పరీక్షలు

దర్శి: స్థానిక ఆదర్శ పాఠశాలలో ఈనెల 30వ తేదీన 2 గంటల నుంచి 3గంటల వరకు 7,8,9 తరగతుల్లో సీట్ల భర్తీకి రాత పరీక్ష నిర్వహిస్తున్నట్లు ప్రిన్సిపాల్ హసీనాభాను ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. అర్హులైన విద్యార్థులు దరఖాస్తు చేసుకుని పరీక్షలకు హాజరు కావాలని కోరారు.



గిద్దలూరు : మాట్లాడుతున్న ఎమ్మెల్యే అన్నా రాంబాబు

జగనన్న సురక్షతో అందరికీ లబ్ధి

గిద్దలూరు రూరల్: జగనన్న సురక్షతో సమస్యలు ఉన్న ప్రతి ఒక్కరికీ లబ్ధి చేకూరుతుందని స్థానిక ఎమ్మెల్యే అన్నా రాంబాబు అన్నారు. జగనన్న సురక్ష పథకంలో భాగంగా పట్టణంలోని గణేష్‌నగర్, కోటగడ్డ సచివాలయాల పరిధిలో గల గృహాలను ఆదివారం అధికార యంత్రాంగంతో కలిసి పరిశీలించారు. సమస్యలను అర్జీల రూపంలో స్వీకరిస్తూ వారికి ఎటువంటి ఇబ్బందులు లేకుండా పరిష్కారం చేస్తామన్నారు. నగర పంచాయతీ చైర్మన్ పాముల వెంకటసుబ్బయ్య, కమిషనర్ వై.రామక్రిష్ణయ్య, వైస్ చైర్మన్ ఆర్.డి.రామక్రిష్ణ, కౌన్సిలర్లు, కో ఆప్షన్ సభ్యులు, వైఎస్సార్ సీపీ నాయకులు కావేటి ఈశ్వర్ నాయుడు, నంద్యాల బాలు, బాలచెన్నయ్య, ముద్దర్ల శ్రీను, రెవెన్యూ, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

అగ్ని ప్రమాద బాధితునికి పరామర్శ

దర్శి: మండల పరిధిలో రెండు రోజుల క్రితం అగ్ని ప్రమాదంలో అభి షాపింగ్ మాల్ దగ్ధం అయిన విషయం విదితమే. షాపు యజమాని మేడా హనుమంతరావును మాజీ మంత్రి శిద్దా రాఘవరావు ఆదివారం పరామర్శించారు. ప్రమాదానికి గల కారణాలను అడిగి తెలుసుకున్నారు. వారి కుటుంబానికి అండగా ఉంటామని హామీ ఇచ్చారు.



పరామర్శిస్తున్న మంత్రి శిద్దా రాఘవరావు

విజయ్‌కుమార్‌కు ఆర్థిక సాయం

దర్శి: ఇండియన్ పారాలింపిక్ వాలీబాల్ భారత జట్టుకు ఎంపికైన వేల్పుల విజయ్‌కుమార్‌కు దర్శికి చెందిన వైఎస్సార్ సీపీ నాయకులు షేక్ అమీన్ బాషా (మిల్లర్ బుజ్జి) రూ.10వేలు ఆర్థిక సాయంగా అందించారు. ఎమ్మెల్యే మద్దిశెట్టి వేణుగోపాల్ ఆదేశాల మేరకు అందించినట్లు తెలిపారు.



ఆర్థిక సాయం చేస్తున్న మిల్లర్ బుజ్జి

వైభవంగా తిరుమంజనసేవ

ఒంగోలు టౌన్: స్థానిక కుర్తాళం సిద్ధేశ్వరీ పీఠపాలిత శ్రీగిరి వెంకటేశ్వరస్వామి ఆలయంలో ఆదివారం అభయాంజనేయస్వామికి తిరుమంజన సేవతో పాటు హనుమద్‌యాగాన్ని వైభవంగా నిర్వహించారు. భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని పూజలు చేశారు. భక్తులకు విశేష అలంకరణలో అభయాంజనేయస్వామి దర్శనమిచ్చారు. శ్రీ వెంకటేశ్వరస్వామికి తులసీ దళాలతో సహస్ర నామార్చన చేశారు. కార్యక్రమంలో ఆలయ ధర్మకర్త ఆలూరు వేంకట రమణారావు, ఆర్జిత సేవల ధర్మకర్త జ్వాలా రామారావు, కార్య నిర్వహణ ధర్మకర్త సీవీ రామకృష్ణారావు పాల్గొని పర్యవేక్షించారు. ఈ నెల 23న ప్రారంభమైన అభయాంజనేయస్వామి ఆగమన ఆరాధనోత్సవాలు ఆదివారంతో ముగిశాయి.



తిరుమంజనసేవ నిర్వహిస్తున్న అర్చకులు, వేదపండితులు

పూడికతీత పనుల పరిశీలన

ఒంగోలు సబర్బన్: నగరంలో మురుగు కాలువల్లో పూడికతీత పనులను డిప్యూటీ మేయర్ వేమూరి సూర్యనారాయణతో కలిసి కమిషనర్ ఎం.వెంకటేశ్వరరావు ఆదివారం పరిశీలించారు. గాంధీ రోడ్డులో పర్యటించి పారిశుద్ధ్య కార్మికులకు పలు సలహాలు, సూచనలు చేశారు. ఎంఈ మాల్యాద్రి, ఇంజినీరింగ్, శానిటరీ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.




పూడికతీత పనులను పరిశీలిస్తున్న డిప్యూటీ మేయర్, కమిషనర్

రోడ్డుపైకి పెరిగిన చిల్లచెట్లు

ఒంగోలు రూరల్: మండలంలో నూతనంగా నిర్మించిన కొప్పోలు–కరవది రోడ్డు పక్కన ఉన్న చిల్లచెట్ల కొమ్మలు రోడ్డుపైకి పెరగడంతో రాకపోకలు సాగించే ప్రయాణికులకు తగులుతున్నాయి. రోడ్డు నిర్మించిన కాంట్రాక్టర్, అధికారులు పట్టించుకోకపోవడంతో ప్రయాణికులు ఇబ్బందిపడుతున్నారు. రాత్రివేళ చిల్లచెట్ల కొమ్మలను గమనించక గట్టిగా తగులుతుండటంతో ప్రయాణికులకు గాయాలవుతున్నాయి. ఎదురుగా వచ్చే వాహనానికి దారిచ్చేందుకు రోడ్డు చివరకు వెళ్లినప్పుడు ఏపుగా పెరిగిన చిల్లచెట్లు ప్రయాణికుల కళ్లు, మొహానికి తగిలి గాయాలవుతున్నాయి. ఈ చిల్లచెట్లను వెంటనే తొలగించాలని ప్రయాణికులు కోరుతున్నారు.

వైభవంగా పోలేరమ్మకు పొంగళ్లు



గార్లదిన్నెలో అలంకరణలో పోలేరమ్మ



గనివానిపాడులో బోనాలతో మహిళలు

కొనకనమిట్ల: మండలంలలోని పలు గ్రామాల్లో ఆదివారం పోలేరమ్మతల్లి ఉత్సవాలు వైభవంగా నిర్వహించారు. సకాలంలో వర్షాలు పడి పాడి పంటలతో గ్రామాలు పచ్చగా ఉండాలని అమ్మవారికి పూజలు చేశారు. గనివానిపాడు గ్రామంలో ఆదివారం తెల్లవారు జామున పోలేరమ్మతల్లికి ఉత్సవం నిర్వహించారు. మహిళలు బోనాలతో వెళ్లి అమ్మవారికి మొక్కులు తీర్చుకున్నారు. సర్పంచ్ పాలూరి లక్ష్మీసాంబ వెంకటేశ్వర్లు అమ్మవారికి పట్టువస్త్రాలు సమర్పించారు. గార్లదిన్నె గ్రామంలో పోలేరమ్మకు పొంగళ్లు పెట్టారు. కుంకుమ బండ్లు కట్టి ఆలయం వద్దకు ఊరేగింపుగా వచ్చారు. ఇటీవల నిర్వహించిన నూతన శివాలయంలో ఎమ్మెల్యే కేపీ నాగార్జునరెడ్డి పూజలు నిర్వహించారు. ఆయన వెంట మాజీ సర్పంచ్ సానికొమ్ము తిరుపతిరెడ్డి ఉన్నారు.



శివాలయంలో ఎమ్మెల్యే కేపీ పూజలు